# అభివృద్ధి ముసుగులో ప్రజాధనం దుర్వినియోగం: కడియం

నేలకొండపల్లి, జనవరి 4 (న్యూస్‌టుడే): రాష్ట్రంలో అభివృద్ధి పేరిట ప్రజాధనాన్ని వై.ఎస్. దోచుకుంటున్నారని తెదేపా ప్రధాన కార్యదర్శి కడియం శ్రీహరి ఆరోపించారు. సైకిల్‌యాత్రలో భాగంగా శుక్రవారం కోరట్లగూడెంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ దేశచరిత్రలో రూ.350 కోట్లను అప్పనంగా ఓ కాంట్రాక్టరుకు అప్పజెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. కాగ్ నివేదిక అనంతరం నీటి పారుదల శాఖ మంత్రి, అధికారులను సస్పెండ్ చేయాల్సిన ప్రభుత్వం వారికి పట్టం కడుతోందని విమర్శించారు. ప్రజాధనాన్ని దోపిడీ చేసేందుకు ఈ ప్రభుత్వం కొత్త నిర్వచనాలు చెబుతోందన్నారు.

## వై.ఎస్. మోసకారి

**కూసుమంచి:** ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడియం శ్రీహరి విమర్శించారు. తెదేపా జిల్లా నాయకులు చేపట్టిన సైకిల్ యాత్రలో శుక్రవారం పాల్గొన్న ఆయన కూసుమంచిలో జరిగిన సభలో ప్రసంగించారు. రైతులు, మహిళలు, యువకులు, వికలాంగులు, నిరుద్యోగులు, తుదకు అడవుల్లో తిరిగే అన్నలను సైతం ఆయన మోసం చేశారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా సాగుతోందని, పేదల జీవన ప్రమాణాలు పడిపోయాయని విమర్శించారు. పార్టీ కార్యకర్తలు రానున్న రోజులను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు.

## దద్దమ్మ ప్రభుత్వం: తుమ్మల

వర్షాలు పుష్కలంగా కురిసి నదులు ప్రవహిస్తున్నప్పటికీ కాలువలకు నీళ్లివ్వని, విద్యుత్తు ఉత్పత్తి చేయలేని దద్దమ్మ ప్రభుత్వంగా తయారైందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. కొత్త ప్రాజెక్టుల ద్వారా కోటి ఎకరాలకు సాగునీరందిస్తామని పూర్తిగా విఫలమయ్యారన్నారు. అభివృద్ధిని మరిచి హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు.



సైకిల్ యాత్రలో పాల్గొన్న కడియం, జిల్లా నాయకులు

## ప్రభుత్వ సంపద పేదలకందాలి: నామా

గత కొన్నేళ్లుగా పెరిగిన ప్రభుత్వ ఆదాయం పేదలకు చెందాల్సిన అవసరం ఉందని పార్టీ రాష్ట్ర నాయకుడు నామ నాగేశ్వరరావు అన్నారు. పేదలు, రైతులను విస్మరించి పెద్దల కొమ్ముకాస్తూ రాజశేఖర్‌రెడ్డి అవినీతిలో అగ్రస్థానంలో నిలిచారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటుతుండగా రైతు ఉత్పత్తులకు కనీస ధరలకు అనుగుణంగా పంటలకు ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి సండ్రవెంకటవీరయ్య అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ నాయకులు ఫణీశ్వరమ్మ, కోనేరు నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, కొండబాల కోటేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, కె.వి. రత్నం, వి.నాగేశ్వరరావు, ఎంపీపీ గోపాలరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఆర్.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## 8న జిల్లాకు చంద్రబాబు

**ఖమ్మం, న్యూస్‌టుడే:** డిసెంబరు 28వ తేదీ నుంచి జిల్లా తెలుగుదేశం నాయకులు చేపట్టిన సైకిల్‌యాత్ర శుక్రవారంతో మూడొందల కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర నేత నామా నాగేశ్వరరావుల సారథ్యంలో యాత్ర ముందుకు సాగుతోంది. ఈ నెల 8న ఖమ్మంలో సైకిల్ యాత్ర ముగింపు సభను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా నేతలు నిర్ణయించారు. సభకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రానున్నారు. ఈ నేపథ్యంలో లక్షమంది కార్యకర్తలతో సభను విజయవంతం చేయాలని నేతలు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.